## పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు ఓటు హక్కును ఉపయోగించుకోవాలి

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు తమ ఓటు హక్కును ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి కోరారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు ఉద్యోగులకు ఇప్పటికీ పోలింగ్ కేంద్రాల వివరాలను అందించడం జరిగిందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు సిద్ధిపేట, దుబ్బాక,గజ్వేల్, హుస్నాబాద్‌లలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఈనెల 8 వరకు ఓటు వేయవచ్చు తెలిపారు. సిద్ధిపేట అర్డీవో కార్యాలయంలో, దుబ్బాకలో ఇంటిగ్రేటెడ్ అఫీస్ కాంప్లెక్స్‌లో గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ అఫీస్ కాంప్లెక్స్, హుస్నాబాద్ అర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ కేంద్రాలలో ఉదయం 10.30 గంటల నుంచి తమ ఓటు హక్కును తప్పనిసరిగా ఉపయోగించుకోవాలన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## పోలింగ్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలి

**-పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి**

మెదక్ మున్సిపాలిటీ, మే5 ప్రభాతవార్త: వేసవి కాలం దృష్ట్యా ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ఎల్. మల్లారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండలు, వడదెబ్బలతో ఉపాధ్యాయులు ఆందోళనలో ఉన్నారని, డూట్యీలు చేయడానికి జంకుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఎండలు మండిపోతున్న దృష్ట్యా మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్, ఇతర ఎన్నికల నిర్వహణ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఎన్నికల నిర్వహణలో సిద్ధిపేట జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు లుకావత్ రామన్న వడదెబ్బకు గురై మరణించడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు దృష్టిలో ఉంచుకొని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, కూలర్స్, చల్లటి త్రాగునీరు, ఎండ తగలకుండా తగు ఏర్పాట్లు చేయాలని, వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచాలని కోరారు.




5కే రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి

## ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనుచౌదరి**

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో ఓటరు శాతం పెంచేందుకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(ఎస్‌వీఈఈపి) ప్రోగ్రామ్ కార్యకలాపాల్లో అదివారం సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 5కే రన్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మిక్కిలినేని మనుచౌదరి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్, సైక్లింగ్ క్రీడాకారులు, విద్యార్థులు,యువకులు, ఉద్యోగులు పెద్దఎత్తున్న పాల్గొన్నారు. ఎస్‌వీఈఈపీ కార్యకలాపాలలో 5కేరన్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోని సిద్ధిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాలు మెదక్ పార్లమెంటు పరిధిలోకి వస్తాయని హుస్నాబాద్ కరీంనగర్ పార్లమెంటు పరిధిలోకి వస్తుందన్నారు. మే 13న జరిగే పోలింగ్‌లో ఓటుహక్కు ఉన్న ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎవరూ ఎటువంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌వీఈఈపీ నోడల్ అధికారి జయదేవ్ ఆర్యా, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషన్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

### పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ఉద్యోగులు

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని ఆదివారం ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. శని, ఆదివారాల్లో వినోద్‌కుమార్, ఆదివారం 253 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని ఆర్‌డిఓ ఎస్ రవి తెలిపారు. ఆదివారం వరకు 460మంది ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్ ద్వార ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

### భక్తులతో పోటెత్తిన తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం

**కౌడిపల్లి, మే 5, ప్రభాతవార్త:** తునికి శ్రీనల్ల పోచమ్మ ఆలయం అదివారం భక్తులతో పొటెత్తింది. ఆదివారం సెలవు దినం కావడంతో ఉదయం నుండి భక్తులు, పలువురు ప్రభుత్వ ఉద్యోగస్థులు కుటుంబ సమేతంగా తునికి శ్రీనల్లపోచమ్మ ఆలయానికి పెద్దఎత్తున తరలివస్తున్నారు. ఈఓ మోహన్‌రెడ్డి, చైర్మన్ తాళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్చకులు శివప్పలు శ్రీనల్లపోచమ్మ అమ్మవారికి పంచామృతాభిషేకం చేసి కుంకుమార్చన చేసిన తర్వాత భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు శివసత్తుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయం చుట్టూ తిరిగి అమ్మవారికి సమర్పించారు. అలాగే జంతు బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈఓ మోహన్ రెడ్డి సిబ్బంది సహకారంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

### పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

**-డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**

**ములుగు, మే 5 (ప్రభాతవార్త):** పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ములుగు మండలం జప్తిసింగాయిపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు నీలం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి తూంకుంట నర్సారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్, బిజెపి పార్టీల నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపి అభ్యర్థి నీలం మధును గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### చిల్వర్‌లో బీరప్పస్వామికి బోనాలు



చిల్వర్ గ్రామంలో బీరప్ప స్వామికి బోనాలను ఊరేగిస్తున్న భక్తులు

**అల్లాదుర్గం, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని చిల్వర్ గ్రామ శివారులోని శ్రీబీరప్ప స్వామికి ఆదివారం బోనాలను ఊరేగించారు. బీరప్ప జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామస్థులు తలపై బోనాలు ఎత్తుకుని సామూహికంగా భజనలు చేస్తూ, యువకుల నృత్యాలు, డోలు వాయిద్యాలు, శివసత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్యా భక్తి శ్రద్ధలతో బోనాలను ఊరేగించారు. గోవింద నామస్మరణతో గ్రామం మారుమ్రోగింది. సామూహికంగా బోనాలతో ఆలయానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలను తిలకించేందుకు గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని బోనాలను తిలకించి స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

### రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో బిజెపిలో చేరికలు

**నర్సాపూర్ మే, 5. ప్రభాతవార్త :** మండల పరిధిలోని నత్నాయపల్లి గ్రామస్తులు పలువురు బిజెపిలో చేరారు. ఆదివారం బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ్, బిజెపి మండల అధ్యక్షుడు నీలి నాగేశ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుండి నత్నాయపల్లి గ్రామానికి చెందిన భూత్ అధ్యక్షుడు సాయినాథ్, బిఆర్ఎస్ పార్టీ నుండి గణేశ్, యాదగిరిలతోపాటు 30 మంది యువ నాయకులు ఆ పార్టీలకు రాజీనామ చేసి బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. పాపగారి రమేశ్‌గౌడ్, నీలి నాగేశ్‌ల సమక్షంలో బిజెపిలో చేరారు.బిజెపిలో చేరినవారికి బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు పాపగారి రమేశ్‌గౌడ, బిజెపి మండల అద్యక్షులు నీలి నాగేశ్‌లతో పాటు పట్టణ అద్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆరు గ్యారెంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలి

◆ ప్రజలను బురిడికొట్టిసున్న సిఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ : మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలని రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు మండిపడ్డారు. సిద్ధిపేట జిల్లా కేంద్రంలో అదివారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని నిర్మల్ బహిరంగ సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్‌గాంధీ కాదు అయన రాంగ్ గాంధీ అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి 5 గ్యారెంటీలను అమలు చేస్తున్నామని చెబుతుంటే రాహుల్‌గాంధీ అన్ని హామీలను అమలు చేస్తున్నట్లు చెప్పడంతో ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. అబద్దాలు చెప్పడంలో సిఎం రేవంత్‌రెడ్డి బ్రాండ్ అంబాసిడర్ కాగా నేనేమి తక్కువ కాదన్నట్లుగా రాహుల్‌గాంధీ మాట్లాడుతున్నారని తెలిపారు. హామీల అమలుపై రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు అబద్దాలు చెప్పడంతోపాటు రాహుల్‌గాంధీతో సైతం అబద్దాలు చెప్పించడం సిగ్గుచేటన్నారు. అరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు ప్రతి నెల ఇచ్చే రూ. 2500 అమలు చేస్తున్నామని రాహుల్‌గాంధీ నిర్మల సభలో చెప్పడం తెలంగాణ మహిళలను అవమానపర్చడమేనని అన్నారు. మహిళలకు ప్రతి నెల రూ. 2500 ఎక్కడ ఇచ్చారో తెలపాలని డిమాండ్‌చేశారు. ఆరు గ్యారెంటీల అమలుపై రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి ఇద్దరు తోడు దొంగల్లా రాష్ట్ర ప్రజలను తప్పుదుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నిర్మల సభలో ఆరు గ్యారెంటీలు అమలవుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చేయకపోవడంతో రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. రాష్ట్రంలో ఏ పథకాలు అమలవుతున్నాయో తెలుసుకోకుండా రాహుల్‌గాంధీ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై మంత్రులను, కాంగ్రెస్ పార్టీ ఎంపి అభ్యర్థులను నిలదీయాలన్నారు. అరు గ్యారెంటీలలో రాహుల్ గాంధీ అన్ని అములయ్యాయని సిఎం రేవంత్‌రెడ్డి 5 గ్యారెంటీలు అమలు చేశామని చెబుతున్నారని నేను మాత్రం ఒక్కటే గ్యారెంటీ అములైందని అంటున్నానని బహిరంగ చర్చకు సిద్దామ అని సవాల్ విసిరారు. దేశంలో పేదరికం, నిరుద్యోగం, అకలి పెరగడానికి కాంగ్రెస్, బిజెపి పార్టీలే కారణమన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గుండు భూపేష్, సంపత్‌రెడ్డి,రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరీష్‌రావు



బీరప్ప జాతర ఉత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### వైభవంగా శ్రీబీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవం

**మనూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోన తుమ్నూర్ గ్రామంలో శ్రీ బీరప్పస్వామి జాతర మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని ఆలయ కమిటి ఘనంగా సన్మానించారు. ఆలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యేతో పాటు బిఆర్ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావ పాటిల్, నాయకులు అశోక్‌రెడ్డి, గుండన్న, కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### మైకోడ్‌లో సామూహిక యజ్ఞం



మైకోడ్‌లో సామూహిక యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

**మనూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని మైకోడ్ గ్రామంలో ఆదివారం వివేకానంద సేవ సమతి ఆధ్వర్యంలో సామూహిక జ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 5 సంవత్సరాలుగా గ్రామం సుభిక్షంగా ఉండేందుకు ప్రతి మాసంలో వచ్చే మొదటి ఆదివారం రోజున గ్రామంలో సామూహికంగా యజ్ఞ పూజా కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా మే నెల మొదటి ఆదివారం ఆలయంలో 12 మంది పుణ్యదంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రార్యక్రమాలకు ముఖ్య అతిథులగూ కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంఘం మహారాజ్, విశ్వహిందూ పరిషత్ తెలంగాణ సత్సంగ్ కమిటి అధ్యక్షులు మరిపల్లి రాంరెడ్డి, వివేకానంద సేవ సమితి బాధ్యులు, గ్రామ భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

### బిజెపిలో చేరిన బిఆర్ఎస్ నేతలు

**సిర్గాపూర్, మే 5, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ జడ్పీటిసి సభ్యులు రాఘవ్ రెడ్డి, రాష్ట్ర లింగ యూత్ ఇంచార్జి అరుణ్ రాజ్‌శేఖర్, మాజీ సర్పంచ్‌లు, బిఆర్ఎస్ నేతలు భారతీయ జనతా పార్టీ ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో ఆదివారం చేరారు. పార్టీలో చేరిన జడ్పీటిసి సభ్యులు, రాష్ట్ర లింగ యూత్‌ఇంచార్జి, మాజీ సర్పంచ్‌లు సంజురెడ్డి,భూమారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కిష్టారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రహీంసాబ్, బాబాసాహెబ్, అమ్సుప్ సాబ్ (80 మంది)ని బిజెపి ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ బిజెపి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతం పలికారు.

# వనదుర్గమ్మ సన్నిధిలో భక్తుల సందడి



పూజలందుకుంటున్న ఏడుపాయల వనదుర్గా భవానిమాత, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

**పాపన్నపేట, మే 5, ప్రభాతవార్త:**

పవిత్ర పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గా భవాని మాత ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

ఆలయానికి చేరుకున్న భక్తులు మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారికి బోనాలు సమర్పించి, ఒడి బియ్యం నింపి కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారి దర్శనానికి ఎలాంటి ఇబ్బంది కల్లకుండా ఆలయ కమిటి చైర్మన్ సాతెల్లి బాలగౌడ్, ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, రవి వీర్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, తోట నరసింహులు, వరుణాచారి, రాజు, శ్రీకాంత్ తదితరులు తగు సహకారం అందించారు.

ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకరశర్మ, పార్థివ శర్మ, మురళీధర్‌లు వేద మంత్రాలు వల్లిస్తుండగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ నరేష్ తన సిబ్బందితో నిఘా నిర్వహించారు.

### సనాతన ధర్మం జీవితంలో భాగమవ్వాలి

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** సనాతన ధర్మ ప్రతి వ్యక్తి జీవితంలో భాగస్వామ్యం కావాల్సి అవసరం ఉందని జన జాగరణ మంచ్ తెలంగాణ ప్రాంత బాధ్యులు నల్లా చక్రవర్తుల రామకృష్ణ పేర్కొన్నారు. పట్టణంలోని రాం మందిరంలో సనాతన ధర్మ-మన కర్తవ్యం అంశంపై బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు నల్లా చక్రవర్తుల రామకృష్ణ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. సనాతన ధర్మం విషయంలో అపోహాలు ఏర్పడేలా రాజకీయ వివాదాలు సృష్టిస్తున్నారని, హిందూమతంలో చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక సమరసత, ప్రకృతి పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేదం లాంటివి ఉన్నాయని, ఈ దిశగా ప్రజలు చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఉందన్నారు. భారతీయత, హిందూ ధర్మం వేరు వేరని గుర్తు చేశారు. క్రమ శిక్షణతో ఎదైనా సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం, బ్రాహ్మణ సేవా సమాజ్ అధ్యక్షులు శంకర్‌రావు కులకర్ణి, రాజ్‌కుమార్ దేశ్‌పాండే, వైద్యులు సురేస్ కులకర్ణి, బావురావు జ్యోషి, పునీత్ దీక్షితులు, సురేష్ జోషి, మహిళా నాయకులు ప్రభావతి, రత్నమాల పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నల్లా చక్రవర్తుల రామకృష్ణ



దగ్ధమవుతున్న అడవీ

### మంబాపూర్ అటవీ ప్రాంతంలో అడవికి నిప్పు

**గుమ్మడిదల, మే 5 ప్రభాతవార్త:** పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదల మండలంలోని మంబాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో ఆదివారం అడవికి దుండగులు నిప్పు అంటించారు. స్థానికుల సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు స్పందించి సకాలంలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బీట్ ఆఫీసర్ మంజత్ సింగ్ మాట్లాడుతూ పర్యవరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, అటవీ ప్రాంతం గ్రామాలకు దగ్గరగా ఉన్నందున ఎవరైనా వెళ్లి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ ప్రాంతానికి నిప్పు అంటించకుండా జాగ్రత్త వహించాలన్నారు. అడవి నిప్పు అంటించడం సరైన పద్ధతి కాదని, క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముస్లాపూర్‌లో కారు దగ్ధం

**అల్లాదుర్గం, మే 5, ప్రభాతవార్త:** హైదరాబాద్ నుంచి నాందేడ్ వైపు అకోలా 161వ జాతీయ రహదారిపై వెళుతున్న కారు అగ్నికి ఆహుతైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని ముస్లాపూర్ గ్రామ శివారులో ప్రయాణిస్తున్న కారు (టిఎస్ 11ఈడి 5325)లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కారు డ్రైవర్ అప్రమత్తతో పెను ప్రమాదం తప్పింది. కారులో ప్రయాణిస్తున్న ప్రయాణీకులు సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. కారులో చెలరేగిన అగ్ని కీలలకు కారు పూర్తిగా కాలిపోయింది. అటుగా వెళుతున్న వాహన చోదకులు విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి చేరవేయగా అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. హైదరాబాద్‌కు చెందిన పంపంగి రమేష్‌కు చెందిన కారుగా గుర్తించామని అల్లాదుర్గం పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



ముస్లాపూర్ జాతీయ రహదారిపై ఆగ్నికి ఆహుతి అవుతున్న కారు

# ఈవీఎంల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**మెదక్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్**

**నర్సాపూర్ మే, 5, ప్రభాతవార్త :**

ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం ఈవిఎంల కమిషనింగ్ ప్రక్రియను చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం నర్సాపూర్ పట్టణ సమీపంలోని బివిఆర్ఐటి కళాశాలలో ఈవిఎంల కమీషనింగ్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు కమీషనింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈవిఎంల సీరియల్ నెంబర్‌లు, అభ్యర్థుల పేర్లు, వారికి కేటాయించిన గుర్తుల ఏర్పాటు పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కమీషనింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించి ఈవిఎంల పనితీరును పరిశీలించాలన్నారు. అలాగే స్ట్రాంగ్ రూమ్ నిర్వహణ వివరాలను ఏఆర్ఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఆర్డీవో కార్యాలయానికి ఓటు వేయడానికి వచ్చే ప్రతి పౌరునికి అధికారులు, సహాయ సహకారాలు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ వెంట ఎన్నికల అధికారి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహాసీల్దార్‌లు కమలాద్రి, శ్రీనివాస్‌చారి, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్

## రూల్స్ మీకే..

### మాకు కాదు అని నిరూపించిన పోలీసులు

# కేబుల్ బ్రిడ్జిపై కేక్ కటింగ్

- నిబంధనలను అతిక్రమిస్తూ తీయని వేడుక
- వివాదంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు



కేబుల్ బ్రిడ్జిపై నిబంధనలను అతిక్రమిస్తూ పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సిఐలు

హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త: దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై పుట్టినరోజు వేడుకలు నిషేదిస్తూ గత నెల 16వ తేదీ నుంచీ ఆంక్షలు విధించిన పోలీసులు, ఇప్పుడు వాటిని ఉల్లంఘించి వివాదంలో చిక్కుకున్నారు. వివరాల్లోకెళ్తే, కేబుల్ బ్రిడ్జిపై వాహానాలు ఆపి, పుట్టినరోజు వేడుకలూ, కోలాహలాలూ, సంబరాలూ జరుపుకోకూడదని నిషేదించి, తగు నిబంధనల ప్రకటనలు ఝారీ చేసిన మాదాపూర్ సిఐ గడ్డం మల్లేష్ నిబంధనల ఉల్లంఘునకు పాల్పడుతూ అదే బ్రిడ్జిపై పుట్టినరోజు వేడుక నిర్వహించి కేక్ కటింగ్ చేశారు. ఈ వేడుకలో భాగంగా సిఐ గడ్డం మల్లేష్‌తో పాటూ, పటాన్‌చెరువు ట్రాఫిక్ సిఐ శ్రావణ్, రాజేంద్రనగర్ సీసీఎస్ సిఐ సంజయ్‌లు పాల్గొని నిబంధనలను అతిక్రమిస్తూ తీయని వేడుక చేసుకున్నారు. రూల్స్ ప్రజలకే గానీ తమకు వర్తించవని ముగ్గురు సిఐలూ రుజువు చేసినట్లుగా ఉన్న ఫొటోలు అంతర్జాలంలో చక్కర్లు కొట్టడంతో నెటిజన్లు ఖంగుతిన్నారు. కేబుల్ బ్రిడ్జిపై పార్టీలు చేసుకుంటే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటూ సెక్షన్ 188 ప్రకారం కేసులు నమోదు చేస్తామని సదరు సిఐ గతంలో హెచ్చరించిన విషయం తెలిసిందే. కాగా వారే ఇలా నియమ నిబంధనలను మీరడమే కాకుండా ఫొటోలు తీసి సామాజిక మాధ్యమాలలో పెట్టడంతో, వారి చర్యలపై నెటిజన్లు మండిపడుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు ఆ ముగ్గురు సిఐలపై తగు చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా తెలంగాణ డిజిపికు ఫిర్యాదు చేశారు.




లక్డీకాపూల్‌లో జరిగిన బీసీల రాజకీయ మేథోమథనం రాష్ట్ర సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

## సామ్యవాద సాహితీ రుషి శ్రీశ్రీ

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: సామ్యవాద సాహితీ రుషి మహాశ్రీశ్రీ అని ప్రముఖ సాహితీ విమర్శకుడు ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారి అన్నారు. ఆదివారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని గుండవరపు హన్మంతరావు కళావేదికలో తెలుగు భాషా చైతన్యసమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ జయంతి సభ ప్రముఖ కవులు రామకృష్ణ, చంద్రమౌళి అధ్యక్షతన జరిగిందంది. ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బాచారి మాట్లాడుతూ శ్రీశ్రీ శ్రామిక జీవుల సౌభాగ్యానికి తన కవితాశక్తిని ధారపోశారన్నారు.

## ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి



1వ వార్డు బాపూజీ నగర్ ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోయిన్‌పల్లి బాపూజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపనప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు సూచించారు. ఆర్థికంగా నిలదొక్కుకున్న దాతలు ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దుర్గయ్య, లక్ష్మణ్, నాగేశ్, కొమురయ్య, మల్లేశ్, శ్రీకాంత్, రాజయ్య, పరశరామ్ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నేతను కస్టడికి తీసుకున్న పోలీసులు



తార్నాక, మే 5 ప్రభాత వార్త : బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్‌ను ఓయూ పోలీసులు ఆదివారం కస్టడికి తీసుకున్నారు. క్రిశాంక్ ప్రస్తుతం చంచల్‌గూడా జైల్లో ఉన్నాడు. ఒయూ అధికారిక లెటర్‌ను మార్ఫింగ్ చేసిన కేసులో ఆయనను అరెస్టు చేసిన విశయం తెలిసిందే. అందులో భాగంగా ఒ.యూ పోలీస్ స్టేషన్‌లో ఆయనను విచారించారు. కోర్టు ఇచ్చిన 24 గంటల కస్టడిలో అతనిని పలు కోణాల్లో పోలీసులు విచారించారు. ఒయూ డాక్యుమెంట్ ఎలా ఎక్కడెక్కడికి సర్కులేట్ చేశారనే విషయాలతో పాటు పలు కోణాల్లో క్రిశాంక్‌ను విచారించారు. అతని వెంట అడ్వకేట్ లక్ష్మణ్ స్టేషన్‌కు వచ్చారు. విచారణ అనంతరం తిరిగి జైలుకు పంపించారు.

## ఉస్మానియా ఆసుపత్రిలో

# ఇక నుంచి స్కిప్ ది క్యూ ద్వారా స్కాన్

### వైద్యం కోసం వచ్చే రోగులు ఆసుపత్రికి వచ్చి లైన్‌లో నిలబడాల్సిన పనిలేదు




అఫ్జల్‌గంజ్, మే 5 ప్రభాతవార్త: ఉస్మానియా జనరల్ ఆసుపత్రి దేశంలోనే పేరుగాంచిన ఆసుపత్రిగా రోగులకు సేవలు అందిస్తుంది. మారుతున్న కాలానికి అనుగుణంగా వైద్యం కోసం వచ్చే రోగులకు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. నేషనల్ హెల్త్ ఎజెన్సీ, ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి స్కిప్ ది క్యూ ద్వారా స్కాన్ చేయాల్సి ఉంటుంది. వైద్యం కోసం వచ్చే రోగులు ఆసుపత్రికి వచ్చి లైన్‌లో నిల్చువల్సిన అవసరంలేదు. ఇంకా నుంచి దీనిని ముందుగా క్యూ ఆర్.కోడ్‌ను స్కాన్ చేసుకోవాల్సి ఉంటుంది. వేగంగా ఓపిడి నమోదు కోసం ముందుగా పై కోడ్ క్యూర్ స్కానర్ ఫోన్ కెమెరా ద్వారా దిగువ అభాయాప్‌లో ఏదైనా స్కాన్ చేసుకో వాల్సి ఉంటుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ తెలిపారు. (ఎబిడిఎం)ప్రారంభించిన యాప్‌ని ఇన్‌స్టాల్ చేసి రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవచ్చునన్నారు. ముందుగా మీ ప్రొఫైల్‌ని ఆసుపత్రి లో పంచుకోండి, తరువాత రిజిస్ట్రేషన్ టోకెన్ పొందవచ్చునన్నారు. మీ టోకెన్ ప్రకారం మీ ఓ.పి.స్లిప్‌ని రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్దకు వచ్చి పొందవచ్చునన్నారు. ఉస్మానియా ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగి ఎక్కడి అయినా (ఎబిడిఎం)ఆంగ్లబాషలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రోగి రిజిస్ట్రేషన్ నమోదు చేసుకుని ఆసుపత్రికి వస్తే కౌంటర్ వద్ద ఓపి స్లిప్‌ని అందచేస్తారు.ఆధార్‌కార్డు నెంబర్,సెల్‌ఫోన్ నెంబర్ నమోదు చేయాల్సి ఉంటుంది.

## కాంగ్రెస్ నేత దారుణ హత్య

అత్తాపూర్ మే 5,ప్రభాతవార్త : పార్లమెంట్ ఎన్నికల వేళ నిండు బహిరంగ సభలో కాంగ్రెస్ నేత దారుణ హత్యకు గురైన సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చేటుచేసుకుంది. పోలిసులు వివరాల ప్రకారం.. రాజేంద్ర నగర్ పరిధిలోని హసన్ నగర్‌లో శనివారం రాత్రి కాంగ్రెస్ సమావేశం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి వెళ్లేందుకు ఇంద్రానగర్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు చేరుకు న్నారు. ఈ క్రమంలోనే మజ్లిస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చేటుచేసుకుంది.కాంగ్రెస్ నేత మక్బూల్ అనే వ్యక్తిపై అంజాద్ అనే వ్యక్తి ఎంఐఎం నాయకులు వచ్చి కత్తితో దాడి చేశారు. భయం దోళనకు గురైన మిటింగ్ వచ్చిన ప్రజ లు పరుగురు తీశారు. ఈ దాడిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో స్థానికులంతా వెంటనే ఆసుపత్రికి తర లించారు. ఆసప్రతిలో చికిత్స పొందుతూ కాంగ్రెస్ నేత మక్బుల్ మృతి చెందారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



జగద్గిరిగుట్ట, మే 5, ప్రభాతవార్త : జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇ.రవీందర్ హెచ్‌సి 3136 ఈ నెల 3వ తేదీన 6గంటల ప్రాంతంలో జగద్గిరిగుట్ట సరిహద్దుల్లో పెట్రోలింగ్ చేస్తుండగా, గాజులరామారం చిత్తారమ్మ దేవాలయం సమీపంలో ఓగుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడని చుట్టు ప్రక్కలవారు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, తెల్ల టీషర్టు నలుపు రంగు ఫార్మల్ ఫ్యాంటుతో అపస్మారక స్థితిలో ఉన్న సుమారు (30-35) సంవత్సరాల వ్యక్తిని గమనించి, అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారు వచ్చి గుర్తు తెలియని వ్యక్తిని పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు వెల్లడించారు.

## విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలతో రాణించాలి : డాక్టర్ రిషికాంత్

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలతో రాణించి దేశానికి, స్వరాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రిషికాంత్ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాలలో 'గలా ఫెస్ట్-2024' ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ఆటపాటలతో ప్రాంగణంలో సందడి చేయడంతో హోరెత్తింది. ముఖ్యఅతిథిగా హాజరై రిషికాంత్ మాట్లాడుతూ సృజనాత్మకతను ప్రదర్శించి తమకు తాము నిరూపించుకోవాలన్నారు. విద్యార్థి జీవితంలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యాలు నిర్వహిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు

# వీళ్లే కీలకం!

### గ్రేటర్‌లో స్థిరపడిన ఇతర రాష్ట్రాల ఓటర్లే ప్రధానం

నగరంలో స్థిరపడిన వారిలో అత్యధికులు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే కావడం. తెలంగాణలో 13వ తేదీనే లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండడం, ఆదే రోజూ ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండడంతో ఇక్కడ స్థిరపడినవారు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఏపీకి వెళ్లేందుకే పలువురు మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో పోలింగ్ శాతంపై ప్రభావం చూపి అభ్యర్థుల భవితవ్యం తమ ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటుండడం గమనార్హం.

- వేర్వేరు ప్రాంతాల్లో లక్షల సంఖ్యలో నివాసం
- శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, ఎల్బీనగర్‌లో ఏపీ వాసులు
- వీరి ఓట్లపై కాంగ్రెస్,బీఆర్ఎస్ ఆశలు
- ఉత్తరాది ఓటర్లపై బీజేపీ కన్ను
- అదే రోజు ఏపీలో ఎన్నికలు
- సొంతూళ్లకు వెళితే పోలింగ్‌శాతం పడిపోయే అవకాశాలు లేకపోలేదు




హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త : ఉద్యోగం, ఉపాధి, విద్య కారణాలేమైనా దేశంలోని వివిధ రాష్ట్రాలు, తెలంగాణాలోని ఇతర జిల్లాల నుంచి గ్రేటర్ హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడుతుంటారు. దీంతో వివిధ మతాలు, సంస్కృతీ సప్రదాయాలు, ఆహారపు అలవాట్లతో హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీగా పేరుగాం చింది. ఈ నెల 13న జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో గ్రేటర్‌లో వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన ఓటర్లు కీలకంగా మారనున్నారు. రాజధాని పరిధిలోని 29 నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలలో అభ్యర్థుల భవితను వీరు నిర్ణయించనున్నారు.

**వారి మద్దతు కోసం..** గ్రేటర్‌లో స్థిర నివాసం ఏర్పర్చుకున్నవారి మద్దతు కూడగట్టేందుకు ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమిస్తు న్నాయి. వీరిని ప్రసన్నం చేసుకోవడానికి సికింద్రా బాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల లోక్‌సభ స్థానాల నుంచి పోటీచేస్తున్న వివిధ పార్టీల అభ్యర్థులు ఆయా ప్రాంతాల నుంచి నేతలను రప్పించి ఆ ఓటర్లతో మాట్లాడిస్తు న్నారు. నాలుగైదు రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి పలు పార్టీల నేతలు ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వస్తుండటం విశేషం. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో ఏపీ నుంచి వచ్చిన వారే అధికంగా ఉన్నారు. ప్రస్తుతం ఈ లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓ వర్గం ఓటర్లను ఆకర్షించేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఉత్తరాది ఓటర్లపై ఆశలు..** ఎల్బీనగర్ పరిధిలో తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇక్కడి కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ అభ్యర్థులు ఆయా ఓటర్ల మీదే దృష్టి పెట్టారు. మహే శ్వరంలో దాదాపు 70వేల నుంచి లక్ష మంది వరకు బిహార్, రాజస్థాన్, యూపీ ఇతర ప్రాంతాల ఓటర్లు ఉన్నారు. వీరిని తమ వైపు తిప్పుకునేందుకు బీజేపీ విశ్వప్రయత్నాలు చేస్తోంది. సాధారణంగానే ఉత్తరాది రాష్ట్రాల వారు బీజేపీకి మద్దతుగానే ఉంటారు. వీరు ఎటువైపు మొగ్గు చూపితే వారికే విజయం లభించే అవకాశం ఉంది. గ్రేటర్ బీజేపీ ప్రధానంగా కొన్ని వర్గాల ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ఆపార్టీ ఎన్‌డిఏ భాగస్వామి జనసేన పార్టీ సహకారం లేకపోలేదు.

**గ్రేటర్‌లో స్థిపడినవారు 42లక్షల మంది..** ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, బిహార్, ఉత్తర ప్రదేశ్, ఝార్ఖండ్, పంజాబ్, తమిళనాడు, కేరళ, ఒడిషా తదితర రాష్ట్రాలతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాలకు సంబంధించి గ్రేటర్‌లో స్థిరపడినవారు సుమారు 42లక్షల మంది ఉంటారని అంచనా. ఏపీ నుంచి వచ్చిన వారిలో అత్యధికంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, మల్కాజ్‌గిరి, ఎల్బీనగర్, సనత్‌నగర్ వంటి నియోజకవర్గాలలో, మహేశ్వరం, గోషామహల్, జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ వంటి సెగ్మెంట్లలో ఇతర రాష్ట్రాల వారు స్థిరపడ్డారు. ఆయా నియోజకవర్గాల్లోని అభ్యర్థుల గెలుపోటములు నిర్ణయించేది వీరే అనడంలో సందేహంలేదు.

## దేవాలయాల పవిత్రతను కాపాడాలి



హైమావతినగర్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ధ్వజస్థంభ ఏర్పాటు సందర్భంగా హోమంలో పాల్గొన్న ఆలయ అధ్యక్షులు డాక్టర్ గూడురు చెన్నారెడ్డి

యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త : దేవాలయాలను పవిత్రంగా ఉంచుకోవడంతో పాటు వాటిని పరిరక్షించుకో వాల్సిన భాద్యత మనందరిపై ఉందని హైమావతినగర్ శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం కమిటి అధ్యక్షులు డాక్టర్ గూడురు చెన్నారెడ్డి అన్నారు.ఆదివారం ఆలయంలో ధ్వజస్థంభ ఏర్పాటుకు దాతలు డాక్టర్ చింతపల్లి వంశీ మోహన్‌రెడ్డి. డిఎస్‌పి, శోభారెడ్డి, ఆధ్వర్యంలో వేద పండితు లచే వేదమంత్రాలతో మేల తాళాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కృష్ణ, జి.నరేందర్‌రెడ్డి, జి.మంజుల రెడ్డి, కళ్యాణిరెడ్డి, శివరా మకృష్ణ, కెహెచ్‌ఎస్ శర్మ, డి.రాములు, దూడల రవిగౌడ్, పామిరెడ్డిప్రవీణ్‌రెడ్డి, ఇందిరా, డి.సందీప్, డాక్టర్ రామారావు, డాక్టర్ పద్మ, గిరిజ, రాధాకృష్ణ, పోతిరాజు నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలను రద్దు చేస్తే ఉద్యమం తప్పదు

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: పరిపాలన సౌలభ్యం కోసం కెసిఆర్ తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాలను ఏర్పాటు చేస్తే సిఎం రేవంత్‌రెడ్డి రద్దు చేసి 19 జిల్లాలు చేస్తామని ప్రకటించడం ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమేనని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్ రావు చెప్పారు. జిల్లాల జోలికి వస్తే సహించేది లేదని ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ప్రజలు కిలోమీటర్ల దూరం పోకుండా సత్వరమే న్యాయం జరగాలని కెసిఆర్ 33 జిల్లాలు చేశారని, దీంతో ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, రోజుల తరబడి కార్యాలయాల చుట్టు తిరగకుండా ఎప్పటి కప్పుడు సమస్యలను పరిష్కారించుకుంటున్నారని చెప్పారు. రేవంత్‌రెడ్డి జిల్లాలను రద్దు చేస్తామనే ఆలోచనను విరమించుకోవాలన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన 2వ వార్డు కాంగ్రెస్ నేతలు

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గం 2వ వార్డుకు చెందిన కొందరు కాంగ్రెస్ నాయకులు, యువకులు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎన్నికల ఇన్‌ఛార్జి రావుల శ్రీధర్ రెడ్డి, అభ్యర్థి నివేదితల సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



శీవారి సన్నిధిలో కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## రిజర్వేషన్లు పరిక్షించాలంటే బిజెపిని గద్దె దించాలి

### మాల ప్రజా సంఘాల జెఏసి చైర్మన్ జి.చెన్నయ్య పిలుపు




సదస్సులో ప్రసంగిస్తున్న జి.చెన్నయ్య

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: భారత రాజ్యాంగాన్ని, ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్‌లను కాపాడుకోవాలంటే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని మాల ప్రజా సంఘాల జెఏసి చైర్మన్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య పిలుపునిచ్చారు. బిజెపి తిరిగి కేంద్రంలో అధికారం చేపడితే రాజ్యాంగాన్ని మార్చివేసి, రిజర్వేషన్‌లను తొలగించే అవకాశం ఉందని ఆరోపించారు. 'రాజ్యాంగాన్ని, రిజర్వేషన్‌లను పరిరక్షిద్దాం' అనే అంశంపై ఆదివారం స్ఫూర్తి భవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాజ్యాంగాన్ని, రిజర్వేషన్‌లను కాపాడుకోవాలంటే బిజెపిని ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని ఆయన సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం అంకితాభావంతో పనిచేసి బిజెపిని ఓడిస్తేనే దళిత బహుజనులతోపాటు మైనార్టిలకు రక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు రాజేష్, రాకేష్, కృష్ణమూర్తి, రమేష్, శ్రీకాంత్, ఎల్లస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు టీ ఎమ్మార్పీఎస్ మద్దతు



విలేకర్ల సమావేశంలో టీ ఎమ్మార్పీఎస్ నేతలు ఇటుక రాజు మాదిగ, కనకరాజు మాదిగ, సంకి రవిందర్ తదితరులు

ఇటుక రాజు మాదిగ

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: లోక్ సభ, కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి టీ ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ, టీ.ఎం.హెచ్.డి.అధ్యక్షులు జన్ను కనకరాజు మాదిగ, 57 ఉప కులాల అధ్యక్షులు చింతల రాజలింగంలు తెలిపారు. ఆదివారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో కూడిన కాంగ్రెస్ పార్టీ దేశ శ్రేయస్సు కోసం పాటుపడుతుందన్నారు. కంటోన్మెంట్ కాంగ్రెస్ అభ్యర్థి శ్రీగణేష్ పార్టీలకు అతీతంగా గత 15 సంవత్సరాల నుంచి కంటోన్మెంట్‌లో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఆయన సేవలను గుర్తించి గతంలో రెండు సార్లు శ్రీగణేష్‌కు బిజెపి టికెట్ ఇచ్చిందన్నారు. కంటోన్మెంట్ వికాస్ మంచ్ సంస్థ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్, టీ ఎమ్మార్పీఎస్ నేత ఇటుక గోపీ మాదిగ, మహిళా నాయకురాళ్లు రేణుక, సబిత, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధుడు అదృశ్యం



పేట్ బషీరాబాద్, మే 5, ప్రభాతవార్త : పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వృద్ధుడు అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి గ్రామంలో నివాసం ఉంటున్న కొమ్ము గోపాల్ (60) ఇంటి వద్దనే ఉండేవాడు. ప్రతి రోజు ఉదయం 7గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్లి చాయ్ షాపు వద్దకు వెళ్లి, అక్కడ చాయ్ త్రాగి తిరిగి 10గంటలకు ఇంటికి వచ్చేవాడు. అయితే ఏప్రిల్ నెల 30వ తేదీన రోజులాగే ఉదయం 7గంటలకు ఇంట్లో నుండి బయటకు వెళ్లి మధ్యాహ్నం 1గంటలకు వరకు ఇంటికి తిరిగిరాలేదు. ఇన్ని రోజులు చుట్టు ప్రక్కలవారిని, బంధువుల వద్ద, తెలిసినవారిని విచారించిన ఎలాంటి ఆచూకి తెలియపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓబీసీ సెంట్రల్ కమిటీ సమావేశంలో పాల్గొన్న చిన్నయ్య ముదిరాజ్, భాగ్యలక్ష్మీ తదితరులు



భాగ్యనగర భరతోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

## జాతీయస్థాయి నృత్య ప్రదర్శనలో అలరించిన చిన్నారులు

హైదరాబాద్, మే 5, ప్రభాతవార్త: జాతీయస్థాయి సంగీత నృత్య ప్రదర్శనలో బాచుపల్లి శ్రీశర్వాణి నాట్య కళాశాలకు చెందిన హరిప్రియ తుమ్మలపల్లి శిష్యులు సమర్పించిన భరతనాట్య ప్రదర్శన ఆహుతులను విశేషంగా అలరించింది. ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన భాగ్యనగర భరతోత్సవం కార్యక్రమంలో చిన్నారులు నేహిత, శ్రీహిత, విరాజిత, లహరి, షష్మితలు వారి వయసుకు తగిన హావ భావాలతో అందరినీ అబ్బురపరిచారు. శ్యామలే మీనాక్షి, అచ్యుతం కేశవం వంటి పాటలతో వారు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన కన్నుల విందు చేసిందని పలువురు కొనియాడారు. నిర్వాహకులు చిన్నారులకు జ్ఞాపికలు అందించి, ఆశీర్వదించారు.

## కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి అద్భుత విజయాలు సాధించారు

### హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి

యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త : ఎంపీగా సికింద్రాబాద్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూనే కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి అద్భుత విజయాలు సాధించారని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భారతదేశంలో టూరిజంను ప్రపంచంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారన్నారు. నేటి రాజకీయాల్లో చిన్న పదవులు వరించగానే ఆడంబారలకు పోయే నాయకులు ఎక్కువగా ఉన్నారని అయితే అత్యున్నత పదవిలో కొనసాగుతున్నప్పటికి ఎటువంటి ఆడంబరాలకు పోకుండా ప్రజలకు ఏమి కావాలి దేశానికి ఎటువంటి సేవలు అందించాలని అనే ఆలోచనతో పని చేస్తున్న ఏకైక నాయకుడు కిషన్‌రెడ్డి అన్నారు. పార్టీ ఎలా ఆదేశించిన ఆభాధ్యత నూటికి నూరు పాల్లు పారదర్శకంగా పూర్తి చేస్తాన్నారు. అందుకు ఉదాహరణగా కోవిడ్ సమయంలో సమర్ధవంతంగా కేంద్రం అప్పజెప్పిన బాధ్యతను పూర్తిచేశారని గుర్తుచేశారు. అయితే తెలంగాణలో వెయ్యిస్థంభాల గుడి, జోగులాంభ ఆలయం, బల్కంపేట ఆలయం ఇలా అనేక ఆలయాలకు పూర్వ వైభవం తేవడంతో పాటు మౌలిక వసతులు కల్పించారన్నారు.

# గ్రామాల్లో బెల్ట్ షాపుల హవా

**విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు**
**పది రూపాయలనుంచి 100 వసూలు**
**అర్ధరాత్రి వరకు విక్రయాలు**
**పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు**



**బొంరాస్‌పేట్, మే 5, ప్రభాతవార్త** బొంరాస్‌పేట్ ,దుద్యాల మండలాల పరిధిలోని గ్రామాలలో బెల్ట్ షాపులదే హవా. బెల్ట్ షాపుల నిర్వాహకులు అధిక ధరకు మద్యం విక్రయించి అందిన కాడికి దండుకుంటున్నారు. వైన్స్ షాపులలో ఉండే మద్యం సగానికిపైగా గ్రామాల్లో ఉన్న బెల్ట్ షాపులలోనే ఉంటుంది. వైన్స్ షాపులలో మద్యం లేకున్నా అన్ని రకాల బ్రాండ్లు గ్రామాలలో లభిస్తున్నాయి. ఈ మద్యం విక్రయాల ద్వారా మందుబాబుల నుంచి ఒక్కొక్క బాటిల్‌కు 10 రూపాయల వరకు అధిక ధరలకు మద్యం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి రోజు ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు 24గంటలు మద్యం విక్రయాలు కొనసాగిస్తున్నారు. దేవాలయాలు ప్రార్థన మందిరాలు పాఠశాలలకు పక్కనే ఈ బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రమ మామూళ్ల మత్తులో చూసిచూడనట్లుగా వ్యహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ మద్యం అమ్మకాల ద్వారా గ్రామాల్లో శాంతి భద్రతలకు కూడా విఘాతం కలిగే అవకాశాలున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. వైన్స్ షాపుల నుంచి దర్జాగా పట్టపగలే ఆటోలు బైకులపై మద్యాన్ని బెల్ట్‌షాపులకు తరలిస్తున్నా కూడా ఎక్సైజ్ అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడంతో విమర్శలకు తావిస్తోంది. ఇకనైనా ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామాల్లోని మహిళలు స్థానికులు ప్రజలు కోరుతున్నారు.

### అధిక ధరలకు మద్యం విక్రయాలు

గ్రామాల్లో ఉన్న బల్ట్ షాపుల్లో యజమానులు ఒక్కో బాటిల్‌పై 10 రూపాయల నుంచి 100 వరకు అధిక ధరకలు 24గంటలపాటు మద్యం విక్ర యాలను నిర్వహిస్తున్నారు. వైన్ షాపులలో బీరు కొరత ఏర్పడడంతో గ్రామాల్లో మందుబాబుల నుంచి అందిన కాడికి దండుకుంటున్నారు.

### ఒక్కో గ్రామంలో 5 నుంచి 10 వరకు బెల్ట్ షాపులు

బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల పరిధిలోని గ్రామాలలో ప్రతి గ్రామంలో 5 నుంచి 10వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు. ఎక్కువగా కిరాణం దుకాణాలలో ఈ కిరాణం షాపులు హోటల్లు దాబాలలలో ఈ బెల్ట్ షాపులను నిర్వహిస్తున్నారు.

### పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

ఇంత జరుగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు మామూళ్ల మత్తులో అధిక ధరలకు విక్రయించిన అర్ధరాత్రి వరకు అమ్మకాలు కొనసాగించినా పట్టించుకోవడంలేదని మహిళలు గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాలలో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై చర్యలు తీసుకుని నియంత్రణ విధించాలని మహిళలు కోరుతున్నారు.

### అధికారి వివరణ

గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాల విషయంలో కొడంగల్ ఎక్సైజ్ శాఖ సిఐ వెంకటేశంను వివరణ కోరగా ఫోన్‌లో స్పందించలేదు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిక

**బొంరాస్‌పేట్, మే 5, ప్రభాతవార్త** కొడంగల్‌లో ఉన్న సిఎం రేవంత్‌రెడ్డి నివాసంలో కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి సమక్షములో బొంరాస్‌పేట్ దుద్యాల మండలాల పరిధిలో బిఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలోకి 20 మంది నాయకులు కార్యకర్తలు చేరారు. వారికి తిరుపతిరెడ్డి కాంగ్రెస్ కాండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మెట్లకుంట గ్రామానికి చెందిన రైతుబంధు అధ్యక్షుడు రమణారెడ్డి లగచర్ల ఎంపిటిసిబిఆర్ఎస్‌పార్టీ నాయకులు రమేందర్‌రెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ జయకృష్ణ మండల అధ్యక్షుడు నరసింహులుగౌడ్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములుగౌడ్ రామ్‌రెడ్డి వెంకటయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి కౌలు రైతు బలి

**మొయినాబాద్,మే 5, ప్రభాతవార్త** విద్యుత్ ఘాతానికి కౌలు రైతు బలైన సంఘటన మొయినాబాద్ మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండలంలోని కనకమామిడి గ్రామానికి చెందిన కంచ కిష్టయ్య (40) కౌలు రైతు కించకిష్టయ్య అతడి కుమారుడు జశ్వంత్ ఇద్దరు కలిసి గూడూరు విట్టలయ్య వద్ద కౌలుకు భూమిని తీసుకుని వరి పంట సాగుచేశారు. శనివారం రాత్రి 11గంటల సమయంలో పొలానికి నీళ్లు పెట్టడానికి కిష్టయ్య స్టార్టర్ వద్ద మోటార్ పెట్టడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి తీవ్రగాయాలైయ్యాయి. వెంటనే చికిత్సనిమిత్తం మండలంలోని భాస్కర్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ డాక్టర్లు పరీక్షించి కిష్టయ్య మృతి చెందాడని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా గట్టుమీద మైసమ్మ బోనాల పండుగ



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం

**బొంరాస్‌పేట్, మే 5, ప్రభాతవార్త** బొంరాస్‌పేట్ మండలం మెట్లకుంట గ్రామంలో వెలసిన గట్టమీద మైసమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. 35 బోనాలతో మహిళలు మేకలు కోడిపుంజులను అమ్మవారికి సమర్పించి తమ మొక్కలు తీర్చుకున్నారు. ఈ క్రమాంలో మాజీ సర్పంచ్ నారాయణ సత్తయ్య కృష్ణ నర్సిములు అంజిలయ్య వెంకటయ్య ఆనందం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి కేంద్రం



లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేస్తున్న దృశ్యం

**కడ్తాల్, మే 05 ప్రభాతవార్త :** లయన్స్ క్లబ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో గత రెండు నెలలుగా కడ్తాల్ బస్టాండ్ ఆవరణలో ఎల్‌సిఎఫ్ కో ఆర్డినేటర్ మాజీ గవర్నర్ జి. చెన్నకిషన్‌రెడ్డి, కడ్తాల్ లయన్స్ క్లబ్ వారి సహకారంతో ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రం విజయవంతంగా కొనసాగుతుందని జి.చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. వేసవికాలంలో ఎండ వేడిమి పెరగడం మూలాన దీనిని దృష్టిలో పెట్టుకొని ఎండలు తీవ్రంగా ముదరడంతో బస్టాండ్ ఆవరణలో ప్రతిరోజు 450 మందికి అంబలి అందజేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రం ప్రయాణీకుల సౌకర్యార్థం బాటసారులకు అంబలి కేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నిరుపేదలకు సేవలందించడ మే లయన్స్ క్లబ్ లక్ష్యమని జి. చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షులు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్, కడ్తాల్ లయన్స్ క్లబ్ సభ్యులు పిఎసిఎస్ ఛైర్మన్ గంప వెంకటేష్, గంప శ్రీనివాసులు, చేగూరి వెంకటేష్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, పిప్పళ్ళ వెంకటేష్, గుదే రాజేందర్, దోనాదుల మహేష్, లక్ష్మయ్య, బిచ్చానాయక్, ఎంపిటిసి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఎల్‌ఎన్ రెడ్డి, డ్రైవర్‌రాజు, లియో క్లబ్ సభ్యులు తరుణ్, జగదీష్, ధర్మేందర్, శ్రీకాంత్, చింటూ, వంశి పాల్గొన్నారు.

## మోడీ చేస్తున్న అభివృద్ధిని చూసే బిజేపిలో చేరిక

**కీసర,మే5,ప్రభాతవార్త:** కేంద్రంలో ప్రధానమంత్రి మోడీ చేస్తున్న అభివృద్ధిని చూసే బిజేపిలో చేరినట్లు మల్కాజిగిరి పార్లమెంట్ బిజేపి అభ్యర్థి ఈటల రాజేందర్ తెలిపారు.ఆదివారం మేడ్చల్ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి కొలిచెలిమి క్రిష్ణ ఆద్వర్యంలో 15 మంది బిజేపి పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ధర్మం కోసం అనే నినాదంలో మోడీ గెలుపుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు.బిజేపి పార్టీలో చేరిన వారిలో బోగారం మాజీ వార్డు సభ్యులు సుంకరి భాగ్యమ్మ,కాటం మల్లేష్,టిఆర్ఎస్ మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ పడమటి రాజిరెడ్డి,టిఆర్ఎస్ నాయకులు దోమల మహేందర్ యాదవ్,గన్నెర్ల నాగరాజు,రాజు,బాలరాజు, సతీష్,రమేష్, నాగిరెడ్డి, కాటం పద్మ,గడ్డం కుమార్,కాంగ్రెస్ నాయకులు కల్పగురి శ్రీకాంత్ తదితరులు చేరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి వద్దనే ఓటు వేసిన వృద్ధులు



మేడ్చల్‌లో ఇంటి వద్దనే ఓటు వేసిన వృద్ధుడు బాలయ్య

**మేడ్చల్, మే 5. ప్రభాతవార్త :** 80 ఏండ్లు పై బడిన వారికి ఇంటి వద్దనే ఓటింగ్ కార్యక్రమాన్ని ఆదివారం ఎన్నికల అధికారులు మేడ్చల్ లో నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు ముందుగా పేర్లను నమోదు చేసుకున్న 80 ఏండ్లు పై బడిని వృద్ధులు ఈ ఓటింగ్‌లో పాల్గొన్నారు. అందులో భాగంగా పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని పి బాలయ్య ఇంటికి అధికారులు వెళ్లగా ఆయన తన ఓటును ఇంటి వద్దనే వేశాడు.

## ఈదురుగాలులతో వర్షం..వేడి నుంచి ఊరట

**ఘట్‌కేసర్, మే 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లిబడింది. గత కొన్ని రోజులుగా ఎండతీ వ్రత పెరగడంతో పాటు వడిగా ల్పులు, ఉక్కపోత కారణంగా జనాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రానికి ఈదురుగాలులు వీచడంతో పాటు కొద్దిసేపు తేలికపాటి జల్లులు పడటంతో వాతావరణం కాస్తా చల్లబడింది. ఈదురు గాలులు వీయడంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఎండల వేడితో ఉక్కిరిబిక్కిరవుతున్న జనాలు వర్షంతో కాస్తా ఊరట చెందారు. ఘట్‌కేసర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, బొక్కోనిగూడ, ఎన్‌ఎఫ్‌సీనగర్, ఘణాపూర్, మాదారం తదితర గ్రామాల్లో చిరు జల్లులు పడ్డాయి.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్.నారాయన్‌రెడ్డి

## నిరుపేద కుటుంబాలకు తనవంతు కృషి చేస్తా : నారాయన్‌రెడ్డి

**పెద్దేముల్, మే 5, ప్రభాతవార్త:** నిరుపేద కుటుంబాలకు తనవంతు కృషిచేస్తానని పెద్దేముల్ సొసైటి డైరెక్టర్ ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన మంగలి నర్సిములు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు శనివారం మృతిచెందాడు. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న ఎస్.నారాయన్‌రెడ్డి బాధిత కుటుంబానికి చెందిన మృతుడి భార్య రేణమ్మకు తనవంతు సహాయంగా రూ.5 వేలు ఆర్థికసహాయం అందజేశారు.ఈకార్యక్రమంలో మత్స్య సహకార సంఘం డైరెక్టర్ తెరువటి నర్సిములు, యండి మైపూస్, మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ తాడి అంజిలయ్య, శివారెడ్డి,తలారి రాములు, మంగలి రాములు, మంగలి పాండు, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిపై నమ్మకంతో పార్టీలో చేరికలు

### బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి

**మేడ్చల్, మే 5. ప్రభాతవార్త :** ప్రధానమంత్రి నరంద్రమోడి సారథ్యంలో కేంద్రంలో సుస్థిర, సమర్ధవంతమైన పాలన కేవలం బిజెపితోనె సాధ్యమని నమ్మిన ప్రజలు బిజెపిలో చేరుతున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని సోమారం గ్రామానికి చెందిన నేతలు పుష్పలత, విశ్వశాంతి, కొండల్‌రెడ్డి తదితరులు ఆదివారం విక్రంరెడ్డి, బిజెపి మేడ్చల్ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, నాయకుడు నందారెడ్డి, మాజీ జడ్పిటిసి శైలజా హరినాథ్ ఆధ్వర్యంలో మల్కాజ్‌గిరి పార్లమెంట్ బిజెపి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్ష్యంలో బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎలాంటి ఒడిదుడుకులు లేని సమర్థ పాలన అందిస్తున్న ఘనత బిజెపి ప్రభుత్వానికే దక్కుతుదని అన్నారు. దేశ ప్రజలకు సుస్థిర పాలన అందిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల గుండెల్లో నిలిచిందని తెలిపారు.నాయకులు సత్యనారాయణ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ఫెలో ఆఫ్ ఏసియన్ పసిఫిక్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ డిగ్రీ పొందిన డాక్టర్ అనుమంతరెడ్డి

**శంషాబాద్, మే 5, ప్రభాతవార్త** మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన ప్రముఖ కార్డియాల జిస్టు డాక్టర్ మల్‌రెడ్డి అనుమంతరెడ్డికి దుబాయ్‌కి చెందిన పసిఫిక్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ ఎమిరేట్స్ కార్డియాక్ సొసైటీ కాన్ఫరెన్స్ 2024 అవార్డును ప్రధానం చేసింది. బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రి లో కార్డియాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్న డాక్టర్ అనుమంతరెడ్డి ఏపిఎస్సీ 2024 కోసం డాక్టర్ వేల్ అల్ మొహమీద్ గ్రాంట్ అవార్డుకు ఎంపికయ్యారు.

## వెంకమ్మగూడలో బిఆర్ఎస్‌కు బిగ్ షాక్

### కాంగ్రెస్ సొంత గూటికి చేరిన బుయ్యని వీరేందర్‌గౌడ్
### ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

**నందిగామ, మే 5, ప్రభాతవార్త** నందిగామ మండలం వెంకమ్మగూడ తాజా మాజీ సర ్పంచ్ బుయ్యని రజనీత వీరేందర్‌గౌడ్ దంపతులు ఆదివారం కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపి శివశంకర్‌గౌడ్ నేతృత్వంలో బుయ్యని రజనీత వీరేందర్‌గౌడ్లతో పాటు సుమారు 20మందికి పైగా బిఆర్ఎస్ నాయకులు కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈకార్యక్రమంలో బుయ్యని వీరేందర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బండ కుమార్ గొల్లపల్లి రాజు బుయ్యని మల్లేష్ జగన్ శ్రావణ్ సతీష్ వెంకటేష్ శ్రీనివాస్ పాండు శీను రాజు జగ్గు విశాల్ నవీన్ శ్రీకాంత్‌గౌడ్‌లు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

**దౌల్తాబాద్,మే 5,ప్రభాతవార్త:** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి బారీ షాక్ తగిలింది.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,కొడంగల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి సమక్షంలో దౌల్తాబాద్ మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి చేరారు.దౌల్తాబాద్ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసి మోహన్‌రెడ్డి,బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ప్రమోద్‌రావు,ఎంపీపీ విజయ్‌కుమార్,పిఎసిఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి,నలుగురు ఎంపీటీసీ లతో పాటు నాయకులు,సుమారు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్ గూటికి చేరారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చెన్నకేశవ స్వామి నాటక ప్రదర్శనకు ఆర్థిక సాయం అందజేత



**తలకొండపల్లి, మే 5, ప్రభాతవార్త** తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో శ్రీచెన్నకేశవ స్వామి నాటకం ప్రదర్శించారు. అంతరించి పోతున్న కళలను ప్రోత్సహిస్తూ కళాకారులకు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు సిఎల్ శ్రీనివాస్ యాదవ్ రూ.10000 ఆర్థిక సాయం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాకారులు శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో విష్ణు సుల్తాన్ సతీష్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ మున్సిపల్ బిజెపిలో భారీగా చేరికలు

**ఘట్‌కేసర్, మే 5, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ప్రజాసంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కల్గుతుందని మేడ్చల్ రూరల్ జిల్లా బిజెపి అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లో ఆదివారం వివిధ పార్టీల నుంచి పలువురు నాయకులు మున్సిపల్ అధ్యక్షులు విప్పర్ల హనుమాన్ ఆధ్వర్యంలో భారతీయ జనతాపార్టీలో చేరారు. పార్టీ ఎన్నికల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బిజెపిలోకి చేరారు. జిల్లా అధ్యక్షులు విక్రమ్‌రెడ్డి నాయకులకు కండువాలు కప్పి బిజెపిలోకి ఆహ్వానించారు. పల్లె ప్రదీప్‌గౌడ్, కొన్నె మురళీగౌడ్, రెడ్డబోయిన ప్రవీణ్, అభిమన్యగౌడ్, అజయ్ ముదిరాజ్, పల్లె అంజనేయులుగౌడ్, పాండుగౌడ్, రేఖ, సోనీ, మమతశర్మ, మణిదీప్, సంజయ్, భార్గవ్, నరేశ్‌గౌడ్, రిషీ, సాయి. ప్రవీణ్‌గౌడ్, షానీబాబు తదితరులు బిజెపిలో చేరారు. మల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా అన్ని వర్గాల ప్రజలు వచ్చి బిజెపిలో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షులు విప్పర్ల హనుమాన్, ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి గుండ్ల అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు కంభం లక్ష్మారెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చ నాయకులు పల్లె మధుసూధన్‌గౌడ్, మున్సిపల్ ప్రధానకార్యదర్శి గుండ్ల రామతీర్థ, నాయకులు కిషోర్‌గౌడ్, సంపత్‌రెడ్డి, పల్లె శివగౌడ్, కరుణాకర్‌యాదవ్, కొన్నె మాధవి, బిల్లా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీలో చేరిన మాజీ సర్పంచ్ సాయిలు

**ఘట్‌కేసర్, మే 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ మాజీ సర్పంచ్ చిలుగూరి సాయిలు బీఆర్ఎస్‌పార్టీకి గుడ్‌బై చెప్పి ఆదివారం అధికారపార్టీలో చేరారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్ ఆధ్వర్యంలో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి సమక్షంలో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మర్రిపల్లిగూడకు చెందిన మాజీ సర్పంచ్ చిలుగూరి సాయిలుతో పాటు బీఆర్ఎస్ నాయకులు మద్ది రవిగౌడ్, మద్ది షానూర్‌బాబుగౌడ్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. సుధీర్‌రెడ్డి వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి అధికారపార్టీలోకి ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె రాజేశ్, మాజీ ఎంపిటిసి సభ్యులు కందుల కుమార్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మద్ది అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తనయుడు విశ్వజిత్‌రెడ్డి

## మామ కోసం కోడలి ప్రచారం..

### ప్రచారంలో జోరు పెంచిన విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబ సభ్యులు
### నియోజకవర్గాన్ని చుట్టేసిన బీజేపీ నాయకులు

**వికారాబాద్,మే 5, ప్రభాతవార్త:** పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో బీజేపీ నాయకుల ప్రచారం జోరందుకుంది. ఇందులో భాగంగా చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపు కోసం బీజేపీ నాయకులతో పాటు ఆయన కుటుంబ సభ్యులు సైతం ప్రచారంలో జోరు పెంచారు. ఆయన తనయుడు విశ్వజిత్‌రెడ్డి ప్రచారంలో దూసుకు పోగా.. విశ్వేశ్వర్‌రెడ్డి కోడలు సైతం మామ కోసం ఎండను సైతం లెక్క చేయకుండా ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం వికారాబాద్ నియోజకవర్గంలోని వికారాబాద్, మోమిన్‌పేట్, మర్పల్లి, ధారూరు మండలాల్లో కొండా విశ్వేశ్వర్ రెడ్డి కుమారుడు విశ్వజిత్ రెడ్డి, కోడలు రిషికారెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వజిత్‌రెడ్డి మాట్లాడుతూ, నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని ని చేయడానికి దేశం మొత్తం సిద్ధంగా ఉందని, అందులో చేవెళ్ల ప్రజలు కూడా భాగం కావాలని ఆయన అన్నారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రతి ఒక్కరికి చేరుతున్నాయని, వీటిని మరింత చేరువ చేసేందుకు కొండా విశ్వేశ్వర్ రెడ్డి లాంటి విజన్ ఉన్న నాయకుడిని ఎన్నుకోవాలని ఆయన సూచించారు. దేశ సుభిక్షంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు బీజేపీ కి ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భుజంగరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**షాబాద్, మే 5, ప్రభాతవార్త :** సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో సరస్వతీ శిశుమందిరాలే కీలకమని దక్షిణమండల క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండల కేంద్రంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో గత 30సంవత్సరాలుగా చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం శ్రీమతి వెలగపూడి విమలావతి మెమోరియల్ శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల షాబాద్‌లో కలుసుకుని తీపి జ్ఞాపకాలు పంచుకున్నారు. చిన్నతనంలో ఏర్పడిన స్నేహబంధం ఎప్పటికి మరిచిపోనిది, విడదీయరానిదని గుర్తుచేసుకున్నారు. వ్యాపార, ఉద్యోగ, కుటుంబాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడినవారు ఒక్క చోటికి రావడం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈరోజు ఎంతో సంతోషంగా ఉందని పూర్వ విద్యార్థులు సందడిగా గడిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా షాబాద్ శిశు మందిర్ పాఠశాల ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిందన్నారు. ఈకార్య క్రమంలో పూర్వ విద్యార్థి పరిషత్ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్, పాఠశాల అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి,ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు హరిశంకర్, నారాయణ, గోపాల్‌రెడ్డి, యాదవరెడ్డి, ప్రాంత పూర్వ విద్యార్థి పరిషత్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు ఉన్నారు.

## మాజీ సర్పంచు, కౌన్సిలర్ బిఆర్ఎస్‌కు రాజీనామా..బిజెపిలో చేరికలు

**శామీర్‌పేట, మే 5, ప్రభాతవార్త** దేవరయాంజాల్ మాజీ సర్పంచు ఇ.శ్రీనివాస్‌ముదిరాజ్, 16వ వార్డు కౌన్సిలర్ ఇ.ఉమశ్రీనివాస్, మరి కొందరు నాయకులు బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరారు. ఆదివారం శామీర్‌పేట మండలం తూంకుంట మున్సిపాల్టీ దేవరయాంజాల్‌కు చెందిన వారు బిఆర్ఎస్‌కు రాజీనామా చేసి బిజెపిలో చేరారు. మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి అభ్యర్థి ఈటల రాజేందర్ నివాసంకు వెళ్లి సమక్షంలో వారు బిజెపిలో చేరారు. వారితో పాటు మాజీ వార్డుమెంబర్ డి.ప్రకాశ్‌గౌడ్, సుమారు 200మంది వరకు పలువురు నాయకులు, యువకులు కూడ వారి వెంట బిజెపిలో చేరటం జరిగిందని అన్నారు. కేంద్రంలో బిజెపి సుస్థిర పాలన, అభివృద్ధి,సంక్షేమ పథకాలు చూసి బిజెపిలో చేరినట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రజలు ఎక్కువగా బిజెపి వైపున దృష్టి సారించారని, కేంద్రంలో బిజెపి మోధీ ప్రభుత్వం అవసరమని భావిస్తూ బిజెపిలో చేరినట్లు తెలిపారు.

## అమిత్‌షా బహిరంగసభకు తరలిన బిజెపి శ్రేణులు



ఎదులాబాద్ నుంచి సభకు వెళ్తున్న బిజెపి నాయకులు

**ఘట్‌కేసర్, మే 5, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్, మండలం నుంచి బిజెపి శ్రేణులు సికింద్రాబాద్ బహిరంగసభకు తరలివెళ్లారు. పరేడ్‌మైదానంలో జరిగిన బహిరంగసభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పాల్గొనగా ఘట్‌కేసర్ నుంచి బస్సుల్లో బిజెపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఘట్‌కేసర్ మున్సిపల్ ఘట్‌కేసర్, ఎన్‌ఎఫ్‌సీనగర్, కొండాపూర్, శివారెడ్డిగూడల నుంచి ముని ్సపల్ అధ్యక్షులు విప్పర్ల హనుమాన్, గ్రామాల నుంచి మండలశాఖ అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావుల ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు బహిరంగసభకు వెళ్లారు. రాష్ట్ర, జిల్లా, మున్సిపల్, మండల నాయకులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇంచార్జులు, వివిధ మోర్చల నాయకులు, కార్యకర్తలు సభకు బస్సుల్లో తరలివెళ్లారు.

# శాంతియుత వాతావరణంలో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలి

### కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులు రాజేంద్రకుమార్ కటారియా



ఈవీఎం రికార్డులను పరిశీలిస్తున్న కేంద్ర ఎన్నికల సంఘం సాదారణ పరిశీలకులు రాజేంద్రకుమార్ కటారియా

**వికారాబాద్,మే 5, ప్రభాతవార్త:** జిల్లాలో శాంతియుతంగా నిష్పక్షపాతంగా పండుగ వాతావరణంలో లోక్ సభ ఎన్నికలు నిర్వహించాలని కేంద్రఎన్నికల సంఘం సాదారణ పరిశీలకులు రాజేంద్ర కుమార్ కటారియా అన్నారు. ఆదివారము లోక సభ కేంద్ర ఎన్నికల సాధారణ పరిశీలకులుగా జిల్లాకు నియమించబడిన రాజేంద్ర కుమార్ కటారియా వికారాబాద్ మండలం సిద్దులూర్ గ్రామానికి చేరుకోగా, జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, జిల్లా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్‌శర్మ ,ట్రైని కలెక్టర్ ఉమాహరతి లు పుష్పగుచ్చాన్ని అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిద్దలూర్ గ్రామం ప్రాథమిక పాఠశాలలో 122, 123 పోలింగ్ స్టేషన్, వికారాబాదు జిల్లా సంగం లక్ష్మీబాయి హై స్కూల్ నందు 137 నుంచి 140 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. త్రాగునీరు, ఫ్యాన్, విద్యుత్, టైలెట్స్ కనీస సౌకర్యాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటరు సమాచార స్లిప్‌లు పంపిణి తో పాటు పోలింగ్ తేదిని తెలపాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి కనీస సౌకర్యాలను ఇతర అంశాలను పరిశీలించారు. అనంతరము మేరినాట్ స్కూల్ నందు లోకసభ ఎన్నికల ఈవీఎం ల పంపిణీ, రిజిస్ట్రేషన్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూము తనిఖీ చేశారు. స్ట్రాంగ్ రూంలోని ఈవీఎంలకు సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. సెక్టరియాల్ అధికారుల విధుల పై అరా తీశారు. వికారాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాటశాల నందు పోస్టల్ బ్యాలెట్ కోసం ఏర్పాటు చేసిన ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో తో కలసి సందర్శించారు. పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ రిజిస్ట్రేషన్, ఓటర్స్ రిజిస్ట్రేషన్ వివరాలతో కూడిన రిజిస్టర్లు పరిశీలించి, ఇప్పటివరకు పోస్టల్ బ్యాలెట్ పద్ధతిన ఎంతమంది ఓటు హక్కును వినియోగించుకున్నారనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్, సువిధ, సి విజిల్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ కేంద్రాన్ని సోషల్ మీడియా, తదితర విభాగాలను పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నిర్వహిస్తున్న రిజిస్టర్లు, సోషల్ మీడియా ద్వారా ఇచ్చిన ప్రకటనల గుర్తింపు, పెయిడ్‌న్యూస్ స్కానింగ్, రాజకీయ ప్రకటనలకు ముందస్తు అనుమతి తదితర రిజిస్టర్ లను తనిఖీ చేశారు. తదనంతరం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిల్లా ఎస్‌పి కోటిరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రైకలెక్టర్ ఉమాహారతి, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ, లోక్ సభ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ సుదీర్, డీఆర్‌డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాష్, తహసిల్దార్ లక్ష్మి నారాయణ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతికి నియామకం పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ పార్టీ మగ్దుంపూర్ గ్రామ అధ్యక్షుడిగా తిరుపతి

**నంగునూర్, మే 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మగ్దుంపూర్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా జాప తిరుపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదివారం టిపిసిసి రాష్ట్ర కార్యదర్శి దేవులపల్లి యాదగిరి, మండల అధ్య క్షుడు తప్పేట శంకర్‌లు నియామకం పత్రాన్ని తిరుపతికి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సత్తయ్య, శ్రీనివాస్, యాదగిరి, రమేష్, బాలయ్య, రాజు, తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## గెలుపు ధీమాతో నిర్లక్ష్యం వద్దు

**కార్యకర్తల సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు**



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు

**చిన్నశంకరంపేట, మే 5,ప్రభాతవార్త:** రానున్న లోక్‌సభ ఎన్నికల్లో గెలు స్తామనే ధీమాతో నిర్లక్ష్యం వహించొద్దని బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. ఆదివానం మండల కేంద్రంలో బిజెపి కార్యకర్తల సన్నా హాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కార్యాచరణ, గెలుపు వ్యూహాలపై పలు సూచనలు చేశారు. ముఖ్యకార్యకర్తలు అందరు కలుపుకుపోయి సంయమనంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు జనగామ మల్లారెడ్డి, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీమ హనుమాన్ ఆలయంలో సప్త మహోత్సవం



శ్రీఅఖండ హరినామ సప్త మహోత్సవ దృశ్యం

**సిర్గాపూర్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని చాప్లా(కె) గ్రామ శివారు ఉజలంపాడ్ గ్రామంలోని శ్రీ సీమ హనుమార్ ఆలయంలో శ్రీఅఖండ హరి నామ సప్తమహోత్స వ పూజా కార్యక్రమాలు వారం రోజులపాటు ఘనంగా నిర్వహించారు. భక్తులు ఆనందోత్స వాలతో ఆడుదూ పాడుతూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు ఆలయ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సంక్షేమం

**ఓయూ జేఏసీ చైర్మన్ రవికుమార్**



మాట్లాడుతున్న రవికుమార్

**నారాయణఖేడ్, మే 5 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంతోనే అభి వృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమవుతుందని, తెలంగాణ ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసింది ఏమిలేదని ఓయూ జేఏసీ చైర్మన్ రవి కుమార్ అన్నారు. ఆదివారం ఆయన నారాయణఖేడ్ పట్టణంలోని ఓ ఫం క్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సోనియమ్మ ఇచ్చిన ఆరు గ్యారం టీల పథకాలు రైతులకు ఎంతో మేలుచేకూరిందన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులను అగణదొక్కి తనపై 72 కేసులుపెట్టి అనేక చిత్రహింసలకు గురిచేశారని చెప్పారు. బీజేపీ అభ్యర్థి బిబీపటేల్ బిజినెస్ పాటిల్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పోతులబోగుడ మోహన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలి : రాజేంద్రకుమార్

**పెద్దేముల్, మే 5, ప్రభాతవార్త:** పార్లమెంటు ఎన్నికలను పు రస్కరించుకొని తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలం లోని కందనెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని మూడు పోలిం గ్ కేంద్రాలను చేవెళ్ళ పార్లమెంటు ఎన్నికల సాధారణ పరిశీల కులు రాజేంద్రకుమార్ కటారియా, జిల్లా కలెక్టర్‌సి. నారాయ న్‌రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి ఆదివారం పరిశీలించారు. పోలింగ్‌కేంద్రాల లోని ఓటర్ల వివరా లను అడిగి తెలుసుకున్నారు.డబుల్ ఓట్లపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల అవరణలో ఉన్న టాయిలెట్స్‌ని పరిశీలించి నీటి సరఫరాపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజేంద్ర కుమార్ మాట్లాడుతూ ఎన్నికలను సజావుగా నిర్వహించేం దుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలోతాండూరు డివిజన్ పంచాయతీ అధికారి శంకర్ నాయక్, మండల తహసిల్దార్ కిషన్, బూత్ స్థాయి అధికా రులు, గ్రామ కార్యదర్శి తదితరులు ఉన్నారు.

## పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**పోలింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఎన్నికల పరిశీలకులు**

**తాండూరు, మే 1, ప్రభాతవార్త :** పార్లమెంట్ ఎన్నికలకు పక డ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర కుమార్ తెలిపారు. పార్లమెం ట్ ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం చేవెళ్ల పార్లమెంటరీ ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్రకుమార్ కటారియా తాండూరు నియోజకవర్గంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి పర్యటించారు. ముందుగా పెద్దేముల్ మండలం కందనెల్లి, యా లాల మండలం రాజీవ్ కాలనీ, తాండూరు పట్టణంలోని సాయిపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలను, ఫెసిలిటేషన్ కేంద్రంలో జరుగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని సెంట్‌మా ర్క్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో స్ట్రాంగ్ రూమును సందర్శించి ఈవీఎం కమిషనింగ్ ప్రక్రియ నిర్వాహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగా డబల్ ఓట్ల వివరాలు వాటిపై తీసు కుంటున్న చర్యలు, ఓటర్ స్లిప్పుల పంపిణీపై పరిశీలకులు బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో తాండూరు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శ్రీనివాసరావు, తహసిల్దారులు తారాసింగ్, కిషన్, డివిజనల్ పంచాయితీ అధికారి పరిశీలకుల లైసెన్ ఆఫీసర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఓటు హక్కు వజ్రాయుధం : తహసీల్దార్

**హుస్నాబాద్, మే 5,ప్రభాతవార్త :**

ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని ఓటును ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వినియోగించుకుని తమ ప్రాంత సమస్యలపట్ల నిబద్ధతతో ఉండాలని హుస్నా బాద్ తహసీల్దార్ రవిందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఈ మేరకు ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్‌లోని మల్లెచెట్టు కూడలి నుండి ఎల్లమ్మ చెరువు వరకు ఫైవ్‌కె రన్ నిర్వహించి ప్రజలకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. మే13పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించినట్లు రవిందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈ పార్లమెంట్ ఎన్నికలకు అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ డిటి రుక్మిణి, సీనియర్ అసిస్టెంట్ పర్వీన్,ఎన్నికల





హుస్నాబాద్ పట్టణంలో ఫైవ్‌కె రన్ ప్రారంభిస్తున్న తహసీల్దార్

శిక్షణ మాస్టర్ ట్రనర్స్ వాసుదేవరెడ్డి, చంద్రశేఖర్, ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయులు చింతకింది శ్రీనివాస్, రజాక్, చీకోటి మహేశ్వర్, మహేష్, హరిప్రసాద్, జెగ్మల్, శ్రీకాంత్, తిరుపతినాయక్, శంకర్, సతీష్‌తో పాటు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



నగేష్‌శెట్కార్‌ను సన్మానిస్తున్న పద్మాశాలీలు

## పద్మశాలీలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం: నగేష్‌శెట్కార్

**నారాయణఖేడ్, మే 5 ప్రభాతవార్త:** పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్‌శెట్కార్ అన్నారు. ఆదివారం నారాయణఖేడ్ పట్టణం లో శ్రీభక్త మార్కండేయ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పద్మశాలీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగేష్ శెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లడుతూ పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ల ప్పుడు అండగా ఉంటుందన్నారు. పద్మశాలీలు సమాజం పట్ల వృత్తిపరంగా బట్టలునేస్తూ జీవనం కొనసాగిస్తారని చెప్పారు. పద్మశాలీల కుల వృత్తులను కాపాడేలా వారి జీవితాల్లో పూర్వవైభవం తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గున్నాల నర్సింలు, గుజ్జెటి సంగయ్య, నక్క నర్సింలు, లక్ష్మినారాయణ, మల్లన్న, కూచిన ప్రకాష్, యువ నాయకులు గున్నాల శ్రీనివాస్, సోమ సిద్ధు, గోస్కే శ్రీనివాస్, గుండు శివకుమార్, బోగ పండరి, ఎనుగంటి శంకర్, దుర్గం సతీష్, అనిల్, మార్గం విఠల్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లిపూర్ చర్చిలో శెట్కార్ కుటుంబ సభ్యుల ప్రార్థనలు



అల్లిపూర్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సురేశ్ శెట్కార్ కుటుంబ సభ్యులు

**జహీరాబాద్, మే 5, ప్రభాతవార్త:** పట్టణ శివారులోని చర్చిలలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్ కుటుంబ భ్యులు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చికి చేరుకున్న సురేశ్ కుమార్ శెట్కార్ సతీమణి ఉమా శెట్కార్, కుమార్తె డాక్టర్ గిరిజశెట్కార్, సోదరుడి జితేంద్రనాథ్ శెట్కార్ ఆర్ధాంగి, మాజీ జడ్పీటిసి సభ్యులు సంగీతశెట్కార్ జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ సునీతా పాటిల్‌లు అల్లిపూర్‌లోని మెథడిస్ట్ చర్చి, బాగారెడ్డిపల్లి చర్చి, గడి చర్చి సెంట్రల్ చర్చి, పులిలొంక చర్చి, లాస్ట్‌డేస్ మినిస్ట్రీస్ చర్చిలలో నాయ కులు నవీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్ అప్పారావు, సుజన్ పాటిల్, కేబుల్ రాజు, చిన్న, వంశి, సురేష్, ప్రమోద్‌కుమార్, నరేష్, ధన్‌రాజ్, అవినాస్, అశీర్, సమ్మద్ రాములు, రవి కిరణ్, భాస్కర్, రబ్బాని, ఉస్మాన్, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నుండి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**నర్సాపూర్ మే, 5, ప్రభాతవార్త :** నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం పలు గ్రామాలకు చెందిన బిఆర్ఎసన పార్టీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు నర్సాపూర్ మండల పరిధిలోని రాచంద్రాపూర్, సీతారాంపూర్,రాయిలాపూర్ గ్రామాల నుండి పెద్ద ఎత్తున బిఆర్ఎస్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు బిఆర్ ఎస్ పార్టీకి రాజినామా చేసి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇంచార్జీ ఆవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జ్యోతి సురేశ్‌నాయక్, మాజీ జడ్‌పిటీసి శ్రీనివాస్‌గుప్త,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గుర్రాల మల్లేషం,నర్సాపూర్ మండల మహిళా అధ్యక్షురాలు సురభీ వినోద, మండల వర్కింగ్ ప్రసిడెంట్ ఉదయ్‌కుమార్, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్,రుస్తుంపేట ఎంపిటీసి గుర్రాల అశోక్,నాయకులు మణిదీఫ్, శ్రీశైలంయాదవ్, ఎద్దు మల్లేష్‌నయాదవ్,యూత్ కాంగ్రెస్‌నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### భానుడి సెగకు పగిలిన కారు అద్దాలు

**చేవెళ్ల, మే 5 ప్రభాతవార్త :** ఎండాకాలంలో రోకలి బండలు పగి లేలా ఎండలు కాస్తున్నాయని సంభోదిస్తుంటాం. ఎండ వేడిమికి పగిలిన బండలను చూడ డం, అరుదే.. కాని కొన్ని రోజులుగా బండలు పగిలి ఎండలు కాస్తున్నాయని మాత్రం చెప్పవ చ్చు. చేవెళ్ల మండల పరిధిలోని ఇబ్రహీంపల్లి వాస్తవ్యు లు అహ్మద్ కారు ఎండ వేడిమి, 46డిగ్రీల ఉష్ణోగ్రత తీవ్రతకు అద్దాలు పగిలాయి. మధ్యా హ్నం కావడంతో జనసంచారం లేకపోవడం వల్ల ఎవరికి ప్రమాదం జరగలేదని స్థానికులు తెలిపారు.



మాట్లాడుతున్న పోగుల రాజు

## ప్రజలు మళ్లీ మోది పాలనే కోరుకుంటున్నారు

**బిజెపి మండల అధ్యక్షుడు పోగుల రాజు**

**చిన్నశంకరంపేట, మే 5,ప్రభాతవార్త:** ప్రజలు మళ్లి నరేంద్రమోదీ పాలనే కోరుకుంటున్నారని బిజెపి మండలాధ్యక్షుడు పోగుల రాజు అన్నారు. ఆదివా రం మండల కేంద్రంలో బిజెపి కార్నర్ మిటింగ్ నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు మళ్లీ మోదీ ప్రధాని కావాల న్నారు. తొమ్మిసంవత్సరాల మోదీ పరిపాలన నితివంతంగా సాగిందన్నారు. అన్ని రంగాల్లో దేశాన్ని అభివృద్ధి చేసిన ఘనత కేవలం మోదికే దక్కుతుంద న్నారు. మోదీ పాలనలో ప్రపంచంలో దేశానికి ఎనలేని గుర్తింపు వచ్చిందని, రానున్న ఎన్నికల్లో 10 నుండి 15 లోక్‌సభ సీట్లు సాధించుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్‌తో పనిలేదనానరు. ప్రజలు మళ్లి మోదీ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, దేశంలో ఉగ్రవాదం తగ్గుముఖం పట్టిందన్నారు. 370 ఆర్టికల్ రద్దుతో జమ్ముకశ్మీర్ ప్రజలకు స్వేచ్ఛ స్వాతంత్రాలు సిద్ధించాయన్నారు. కరోనా సమయంలో దేశాన్ని ఒక తాటిపై నడిపి విజయవంతంగా కరోనాపై విజయం సాధించామన్నారు. దేశంలో ఉచిత రేషన్‌బియ్యం ఇస్తున్న ప్రభుత్వం మోది ప్రభుత్వం మాత్రమే అన్నారు. ప్రజలు ఆలోచించి ఓటు వేసి మెదక్‌లో రఘునందన్‌రావును, దేశంలో మోదిని గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుభాష్‌గౌడ్, నాయకులు ఆకుల రాజు, దశరథం, మంజుల, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు మహిళ మృతి

**ఆమనగల్లు, మే 5 ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణ సమీపం లో పిడుగు పడి ఓ మహిళా రైతు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పట్టణంలోని శ్రీకాంత్ కాలనికి చెందిన కావటి లక్ష్మమ్మ (45) గుర్రం గుట్ట వెనుకాల ఉన్న తన వ్యవసాయ క్షేత్రంలో పొలం పనులు చేస్తుండగా ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పాటుకు గురైంది. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినది. లక్ష్మమ్మ మృతితో ఆమె కుటుంబంలో విషాధచాయలు అలుముకున్నాయి.

## పారదర్శకంగా ఎన్నికల నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి

**-ఎన్నికల పరిశీలకులు త్సావాంగ్గౌచో భూటియా**

**కొడంగల్,మే 5ప్రభాతవార్త** పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా పారదర్శంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ని కల పరిశీలకులు ఐఎఎస్ అధికారి సూచించారు. ఆదివారం మహబు బ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని కొడంగల్ నియోజకవర్గానికి సంభందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం గోడౌన్‌ను అసిస్టెంట్ రిట ర్నింగ్ అధికారి లింగ్యానాయక్‌తో కలిసి సందర్శించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రంతో పాటు ఈవీఎం కమీషనింగ్ జరు గుతున్న తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్య క్రమంలో కొడంగల్, కోస్గి, దుద్యాల్, మద్దూర్, కొత్తపల్లి, గుండుమాల్ తహశీల్దార్‌లు విజయ్‌కుమార్, శ్రీనివాస్, దానయ్య, మహేష్‌గౌడ్,అనిల్‌కుమార్, పాల్గొన్నారు.

## క్రీడలలో గెలుపు, ఓటమిలు సహజం

**కొత్తూర్, మే 5, ప్రభాతవార్త :** క్రీడలలో గెలుపు ఓటమి సహజమని, నేడు ఓటమి రేపటి గెలుపుకు పునాది అని ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూర్ మండలంలోని గూడూరు గ్రామంలో ఏర్పాటుచేసిన గూడూరు ప్రీమియం లీగ్‌క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఎంపీపీ పిని న్నంటి మధుసూదన్‌రెడ్డి బహుమతులు అంద జేశారు. టోర్నీలో మొదటి బహుమతి పొందిన టీం గూడూరు జూనియర్స్ టీం విన్నర్ ట్రోఫీతో పాటు రూ.10వేల నగదు బహుమతి, రన్నర్ టీం మక్తగూడ ఎంకే క్రికెట్ వారియర్స్ టీం ట్రోఫీతో పాటు రూ.5వేల నగదు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... క్రీడలలో గెలుపు ఓటమిలు సహజమని, దీనిని ప్రతి ఒక్కరు కూడా ఓటమిని రేపటికి గెలుపుకు పునాదిగా భావించాలని సూచించారు. అదేవి ధంగా క్రీడలను ప్రతి ఒక్కరు స్నేహభావంతో కలిసి ఉత్సా హపర్చు కోవాలన్నారు. ఈకార్యక్రమం లో తాజా మాజీ సర్పంచులు బ్యా గరి సత్త య్య, అంబటి ప్రభాకర్, కాట్న రాజు, రవినాయక్, ఉపసర్పం చులు దయానంద్‌గుపాత, దశరథ్‌నాయక్, నరసింహారెడ్డి, మాజీ ఎంపిటీసీ మోడీ దర్శన్, జయేందర్‌రెడ్డి, సిద్ధుగౌడ్, శంకర్‌నాయక్, రవినాయక్, దయానంద్‌రెడ్డి, పద్మారావు, ఆంజనేయులు ముదిరాజ్, శ్రీరాములుగౌడ్, బోకుల రాజు, క్రీడాకారులు ఉన్నారు.

# పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన కరాటే విద్యార్థులు

**మెదక్ మున్సిపాలిటీ, మే 5 ప్రభాతవార్త:**

పదవ తరగతిలో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన కరాటే విద్యార్థులను ఆదివారం మెదక్ గుల్షన్ క్లబ్‌లో అభినందించి వారికి సన్మానం చేయ డం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైట్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, విశిష్ట అతిథిగా డీవైఎస్‌వో నాగరాజు, గౌరవ అతిథిగా ఇంటర్మీడి యట్ బోటనీ జేఎల్ స్వర్ణలత, కార్యనిర్వాహక అధ్యక్షులు రెన్‌జుకీ షోటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ఫౌండర్, డైరెక్టర్ నగేష్ మల్లారిలు విచ్చేసి వారిని అభినందించారు. డైట్ ప్రిన్సిపాల్ రమేష్ బాబు మాట్లాడుతూ యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకొని దాని కోసం నిరంతరం శ్రమించిన ప్రతి విద్యార్థులు సంఘంలో ఉన్నత స్థానంలో ఉంటా రని చెప్పారు. డీవైఎస్‌వో నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతోపాటు శారీరకశ్రమ, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని చెప్పారు. శారీరకంగా ధృడంగా ఉండి మానసికంగా స్థిరంగా ఉన్న విద్యా ర్థులు విద్యలో ముందుంటారని, దానికోసం కరాటే లాంటి వ్యాయామ విద్యలు విద్యార్థులకు ఖచ్చితం గా అవసరమని అన్నారు. అనంతరం జేఎల్ స్వర్ణలత మాట్లాడుతూ విద్యార్థుల గమ్యానికి దిశా నిర్దేశాన్ని ఇచ్చేది ఇంటర్మీడియట్ అని తెలిపారు.





పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ఇంటర్మీడియట్‌లో మిత్రుల కోసం మీ దిశా నిర్దే శాన్ని మార్చుకోవద్దన్నారు. తరువాత పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన కరాటే విద్యార్థులను అభినందించడం జరిగింది. పదవతరగతిలో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన కరాటే విద్యార్థులు కీర్తి స్వరాజ్ 10/10, నిత్యస సిరి 9.8, విలోహిత్ 9.5, సోఫియా 9.5, ఆగస్త్య 9.5, రవళి 9.5, కార్తీక్ 9.0, ప్రణయ్ 9.5, మణికంట 9.0, వైష్ణవి 8.5, అభిషేక్ 7.5, సూరజ్ 7.0, ఉమా దేవి 9.5, మణిదీప్ 8.5. ఈ సందర్భంగా కరాటే మాస్టర్ నగేష్ మాట్లాడుతూ నేటి యువత సామా జిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ ఉదయాన్నే వ్యాయామం, కరాటే,యోగాలాంటి ఆరోగ్య సూత్రా లను పాటిస్తున్న విద్యార్థులు ఎంతో చురుకుగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమం లో స్థానిక కరాటే మాస్టర్ దినకర్, అరవింద్, రంగంపేటకు చెందిన కరాటే మాస్టర్ మల్లేష్, గణేష్, శంకరంపేటకు చెందిన కరాటే మాస్టర్ పరశురాం, పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు

**చిన్నకోడూరు, మే 5, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మెట్టుపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు అదివారం డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు సమక్షంలో అ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరినవారికి డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగ రాజు కండువాలుకప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీ లో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరినవారిలో సింగిరెడ్డి చంద్రారెడ్డి, కను కవ్వ, కనకయ్య, భూపతిరెడ్డి, ధర్మారెడ్డి, తిరుపతి, రాజిరెడ్డి, బాలయ్య, సంపత్‌రెడ్డి, నాగవ్వ, వనిత, లావణ్య తదితరలు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, గణేష్, వినోద్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## డి.ధర్మారంలో 60 మంది యువత బిజెపిలో చేరిక

**రామాయంపేట, మే 5, ప్రభాతవార్త :** నిజాంపేట జడ్పీటీసీ, భారతీయ జనతా పార్టీ మెదక్ నియోజకవర్గ ఇంచార్జి పంజా విజయ్‌కుమార్ ఆధ్వర్యం లో రామాయంపేట మండలం ధర్మారం గ్రామంలో 60 మంది యువకులు బిజెపిలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోడీ భారతదేశ కీర్తిప్రతిష్టలు పెంచడంతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ది చేసిన, మోడీ అయోధ్య రామ మందిర నిర్మాణం హిందువుల చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు. 10 ఏళ్ల తెలంగాణ రాష్ట్రాన్ని ఆగం ఆగం చేసి కేసీఆర్ కుటుంబం ప్రజలను మోసం చేసిందన్నారు. అబద్దపు హామీలు ప్రచారాలతో కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పాలించి కుటుంబ రాజకీయలను పూర్తిగా అంతం చేయాలని నీతివంతమైన, నిజాయితీ పరులను దేశ ప్రజలే తన కుటుంబంగా పనిచేస్తున్న మోడీ మూడవసారి ప్రధానిగా కావాలని ఈ రోజు ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు దయానందరెడ్డి, ధర్మారం వార్డు సభ్యులు లక్ష్మణ్, స్వామి, సతీష్, బిజెపి జిల్లా సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నవాత్ రాజేంద్రప్రసాద్, జె.శంకర్‌గౌడ్, యువకులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**తొగుట, మే 5, ప్రభాతవార్త :** తొగుట గ్రామానికి చెందిన కాసర్ల మైసవ్వ కూడవెల్లివాగులో పడి చనిపోవడంతో బాధిత కుటుంబానికి మెదక్ పార్ల మెంట్ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసహాయం అందించారు. కో-ఆప్షన్‌సభ్యులు ఎం.డి.కలీమోద్దీన్ చేతులమీదుగా ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి, దాసు అరుణ్ కుమార్, కాసర్ల పోచయ్య, శివరామణి నవీన్, ఎర్రోళ్ల మల్లేశం పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**నారాయణఖేడ్, మే 5 ప్రభాతవార్త:** నిజాంపేట మండలం దామరచెరువు గ్రామానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు ఉమ్మడి మెదక్ జిల్లా మాజీ ప్రణాళిక సంఘ సభ్యులు నగేష్‌శెట్కార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి నగేష్‌శెట్కార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శంకర్‌గౌడ్, పోచయ్య, మల్లేశం, సంజీవరెడ్డి, రాదాకిషన్,రాఘుపతిరెడ్డి, గంగారామ్, దేవిదాస్, గోపాల్, సర్దార్‌సేట్ వెంకట్‌రెడ్డి, ప్రవీన్‌గౌడ్, సుదర్శన్, శ్రీకాంత్, సాయిలు,సురేష్,దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

**కల్హేర్, మే 5 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మెట్టుకుంట తండాకు చెందిన గంగారాం కూతూరి వివాహనికి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వీరితోపాటు జడ్పీటీసీ సభ్యులు నర్సింహారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రామ్‌సింగ్, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి,నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రామ్‌రెడ్డి, సాయిగొండ,శ్రీనివాస్, మారుతి, గంగారాం, పోచయ్య పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, మే 5, ప్రభాతవార్త:** మండలంలోని చుక్కల్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు సాయిలు కుమార్తె నూతన వస్త్రా లంకరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి హాజరై చిన్నారులను ఆశీర్వదించి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేవెంట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు విఠల్‌రావు పాటిల్, నాయకులు, న్యాయవాది లక్ష్మన్ రావు, గ్రామ పార్టీ అధ్యక్షులు సాయిలు, నాయకులు నారాయణ, జగ్గప్ప, సాయిలు, నరేందర్, దత్తురావు, గజానంద్, నందు పాల్గొన్నారు.

## కందిలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం



కంది జడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**కంది, మే 5, ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89 విద్యాసంవత్సరంలో ఎస్ఎస్‌సిలో విద్యను అందు కున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానిన ఆదనందోత్స వాలతో ఘనంగా ఆత్మీయంగా జరుపుకున్నారు. కలిసి చదువుకున్న విద్యార్థులు వేరు ప్రాంతాల్లో, వేరు వేరు ఉద్యోగాలు, వ్యాపారలు చేస్తూ కుటుంబ సభ్యులతో ఉన్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోటకు చేరుకుని కుశల ప్రశ్నలు వేసుకుని, కొనసాగుతన్న జీవితాలపై చర్చించుకున్నారు. నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను కార్యక్రమానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సత్తార్ ఖాన్, వీరేశం గౌడ్, సిరాజుద్దీన్, బిక్షపతి, సునీత, వనంపల్లి భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, బాలామృత, మాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

### జగదేవ్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...





ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్న పూర్వ విద్యార్థులు

**జగదేవ్‌పూర్, మే 5 (ప్రభాతవార్త):** మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992-93 విద్యాసంవత్సరంలో పదవ తరగతి పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మేళన కార్యక్రమానికి విచ్చేసిన పూర్వ విద్యార్థులు తమ గత స్మృతులను నెమరేసుకున్నారు. అలాగే వారికి విద్యాబుద్దులు నేర్పిన గురువులు వెంకటరాములు, ఆంజనేయులు తదితరులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆ రోజుల్లో క్రమశిక్షణతో చదువుకున్న మీరు ఉన్నత స్థాయికి ఎదగడం గర్వకారణమని, తాము విద్యాబుద్దులు నేర్పిన విద్యార్థులు వివిధ రంగాలలో ఉన్నత స్థాయిలో ఉండడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, రవీందర్‌రెడ్డి, ఫణిధర్, నగేష్, భాస్కర్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్, జెసిబిలు పట్టివేత

**కేశంపేట, మే 5, ప్రభాతవార్త:**

కేశంపేట మండల పరిధిలోని వేముల్‌నర్వ చెరువు నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న జెసిబి టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై కుప్పగిరి లింగం తెలిపారు. వేముల్ నర్వ గ్రామ శివా రులో గల కోమటి చెరువులో నుంచి ఏలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్ జెసిబిలను పట్టుకుని టిప్పర్ డ్రైవర్ కొమురయ్య జెసిబి డ్రైవర్ పవన్ మరియు జేసిబి టిప్పర్ యజ మానులపై కానిస్టేబుల్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.